ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం
# టీ-మీడియా
సామాజికం.. ప్రజల పక్షం...
సంపుటి : 9
సంచిక : 210
పేజీలు : 4
ఆదివారం 22.02.2026
GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in
ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

## కలెక్టర్ తో ఎంపీ రఘురాంరెడ్డి భేటీ



**టీ మీడియా,ఫిబ్రవరి21, ఖమ్మం :** పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని శనివారం కలిశారు. వీ.వెంకటాయపాలెం వద్ద గల ఐడిఓసికి వెళ్లగా అదనపు కలెక్టర్ పీ. శ్రీనివాసరెడ్డి పూల మొక్క అందజేసి స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ ఛాంబర్ లో అనుదీప్ దురిశెట్టితో భేటీ అయ్యారు. ఎంపీ నిధుల పనుల పురోగతిపై ఆరా తీశారు. ఇంకా.. కొత్తగా చేపట్టబోయే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలు తెలుసుకున్నారు. ఈజీఎస్ పనులు వేగవంతంగా పూర్తి చేయించాలని సూచించారు.





# గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలి..

### • జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**టీ మీడియా ,ఫిబ్రవరి 21, ఖమ్మం:**గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.డి.పి.ఆర్.సి. సెంటర్ లో నూతన సర్పంచ్ లకు ఏర్పాటు చేసిన శిక్షణ ముగింపు కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూలి ప్రజల ఆశీర్వాదంతో గ్రామాలలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్ లకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. సర్పంచ్ లకు పెద్ద బాధ్యత ఉంటుందని, రాబోయే 5 సంవత్సరాల పాటు బాధ్యత బాగా నిర్వర్తించాలని కలెక్టర్ సూచించారు. సర్పంచ్ విధి నిర్వహణలో తీసుకోవాల్సిన చర్యలు, కార్యచరణపై ఫిబ్రవరి 17 నుంచి 21 వరకు 5 రోజుల పాటు ప్రత్యేక శిక్షణ అందించడం జరిగిందని అన్నారు. పంచాయతీ కనీస బాధ్యతలు కట్టుదిట్టంగా నిర్వహిస్తే, ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తారని కలెక్టర్ అన్నారు. గ్రామ పారిశుధ్యం పరిశీలించి గ్రామ సర్పంచ్, పాలకవర్గం, పంచాయతీ కార్యదర్శి పనితీరు చెప్పవచ్చని కలెక్టర్ తెలిపారు. ప్రతి రోజు చెత్త సేకరణ సజావుగా జరుగుతుందా, పారిశుద్ధ్య నిర్వహణ ఎలా ఉంటుంది అనే అంశాన్ని సర్పంచ్ పర్యవేక్షించాలని అన్నారు.గ్రామాలలో పచ్చదనం పెంచేందుకు కృషి చేయాలని అన్నారు. గ్రామ అభివృద్ధి పనులు ప్రణాళిక ప్రకారం చేపట్టాలని కలెక్టర్ సూచించారు. పంచాయతీ దగ్గర అందుబాటులో ఉన్న నిధులు ఎలా ఖర్చు చేయాలో పటిష్ఠ కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని అన్నారు. పంచాయతీ పాలక వర్గం సమావేశాలు రెగ్యులర్ గా నిర్వహించి తీసుకున్న నిర్ణయాలను ఎప్పటికప్పుడు రికార్డు చేయాలన్నారు. గ్రామ సర్పంచ్ లు అధికారులతో సమన్వయంతో పని చేస్తూ గ్రామసమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల వరకే రాజకీయాలు ఉండాలని, సర్పంచ్ గా గెలిచిన తర్వాత గ్రామంలో అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని పని చేస్తేనే అభివృద్ధి సాధ్యం అవుతుందని అన్నారు. గ్రామాలలో పన్ను వసూలుపై సర్పంచ్ శ్రద్ధ పెట్టాలని, ప్రతి ఒక్కరు తప్పనిసరిగా పన్ను కట్టేలా ప్రజలను ప్రోత్సహించాలని, పన్ను ఎగవేత ఎట్టి పరిస్థితుల్లో సహించ వద్దని, పాత పన్ను బకాయిలు కూడా వసూలు చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని కలెక్టర్ తెలిపారు. మన గ్రామాలను దేశంలో అత్యుత్తమ గ్రామాలుగా తీర్చిదిద్దుతూ జాతీయ స్థాయి అవార్డులు సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. పంచాయతీ పాలనపై సర్పంచ్ పట్టు సాధిస్తే అభివృద్ధి మరింత మెరుగ్గా సాధ్యం అవుతుందని అన్నారు. ఆర్థిక సంఘం నిధులు 33 కోట్ల రూపాయలు జిల్లాలో గ్రామ పంచాయతీ లలో జమ అయ్యాయని, వీటిలో 20 కోట్ల రూపాయలు గ్రామాలలో పారిశుద్ధ్య, పంచాయతీ సిబ్బంది వేతనాలు, విద్యుత్ బిల్లులు వంటి టైడ్ గ్రాంట్ నిధులు, 13 కోట్ల రూపాయలు అభివృద్ధి నిధులు ఉన్నాయని, మార్చి 31 వరకు మరిన్ని నిధులు జమ అవుతాయని కలెక్టర్ తెలిపారు. ఆర్థిక సంఘం నిధులను దుబారా చేయకుండా సక్రమంగా వాడుకునేందుకు గ్రామ పంచాయతీ డెవలప్మెంట్ ప్లాన్ తయారు చేయాలని కలెక్టర్ సూచించారు. గ్రామాలలో రోడ్లు, డ్రైన్ల నిర్మాణం మాత్రమే అభివృద్ధి కాదని, గ్రామాలలో మెరుగైన పారిశుద్ధ్యం, పచ్చదనం పెంచడం వంటి పనులు కూడా అభివృద్ధి అవుతాయని కలెక్టర్ తెలిపారు. గ్రామాలలో ప్రభుత్వ పథకాల అమలు తీరు కూడా సరిగా అవుతుందో లేదో దృష్టి పెట్టాలని, ఎక్కడైనా సమస్యలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయితి అధికారి రాంబాబు, అధికారులు, గ్రామాల సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

# 108ను తనిఖీ




### • వైద్య ఆరోగ్య అధికారి తుకారం రాథోడ్

**టీ మీడియా,ఫిబ్రవరి21, కొత్తగూడెం:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో శనివారం రోజున జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్, జిల్లాలో నడుస్తున్న 108 అంబులెన్స్ వాహనాలపై సమగ్ర తనిఖీ చేసి ఆడిట్ నిర్వహించారు. ప్రజలకు అత్యవసర వైద్య సేవలు సమర్థవంతంగా, వేగవంతంగా అందుతున్నాయా అనే దానిపై ప్రత్యేక దృష్టి సారించారు.తనిఖీ సందర్భంగా వాహనాల బయటి, లోపలి పరిస్థితి, టైర్లు (స్టెప్నీ సహా), హెడ్‌లైట్లు, ఇండికేటర్లు, సైరన్, పీఏ సిస్టమ్ పనితీరు, జీపీఎస్ వ్యవస్థ పని స్థితి, ఇంధన స్థాయి, లాగ్‌బుక్ నిర్వహణను పరిశీలించారు. అదేవిధంగా ఆర్సీ, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికేట్ల చెల్లుబాటు స్థితిని ధృవీకరించారు.వైద్య పరికరాలలో ఆక్సిజన్ సిలిండర్ ప్రెషర్ స్థాయి, బీవీఎం (వయోజనులు, పిల్లల కోసం), సక్షన్ యంత్రం, బీపీ యంత్రం, స్టెతస్కోప్, గ్లూకోమీటర్, పల్స్ ఆక్సీమీటర్, స్ట్రెచర్, స్పైన్ బోర్డ్, సర్వైకల్ కాలర్లు, డెలివరీ కిట్, ఇతర అత్యవసర పరికరాలను తనిఖీ చేశారు.అలాగే ఔషధ కిట్‌లో అడ్రినలిన్, అట్రోపిన్, డెక్స్ట్రోస్, ఐవీ ద్రావణాలు తదితర అత్యవసర మందుల లభ్యత గడువు తేదీలను పరిశీలించారు. అంబులెన్స్‌ల శుభ్రత, లీనెన్ పరిస్థితి, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ విధానం, పీపీఈ కిట్లు, హ్యాండ్ శానిటైజర్ల లభ్యతను కూడా ధృవీకరించారు. ప్రజలకు అత్యవసర సేవలు ఎటువంటి లోపాలు లేకుండా అందించాలనే ఉద్దేశంతో, ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ తెలిపారు.

# మీసేవ సర్టిఫికెట్ వెరిఫికేషన్

### • మొబైల్ యాప్‌పై జిల్లాస్థాయి శిక్షణ




**టీ మీడియా, ఫిబ్రవరి 21,భద్రాద్రి కొత్తగూడెం:**జిల్లాలో మీసేవ సేవలను మరింత సమర్థవంతంగా అమలు చేసి, ప్రజలకు సమయపాలనతో సేవలు అందించడమే లక్ష్యంగా ఐడీఓసి కార్యాలయం సమావేశ మందిరంలో శనివారం జిల్లాలోని నయాబ్ తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, జీపీవోలకు మీసేవ సర్టిఫికెట్ వెరిఫికేషన్ మొబైల్ యాప్ వినియోగంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించబడింది. జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని జిల్లా ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ సైదేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ మాట్లాడుతూ, మీసేవ కేంద్రాల్లో స్వీకరించే దరఖాస్తులను వేగవంతంగా మరియు పారదర్శకంగా పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మీసేవ ఫీల్డ్ వెరిఫికేషన్ మొబైల్ యాప్ వినియోగం అత్యంత కీలకమని తెలిపారు. యాప్ ద్వారా క్షేత్రస్థాయిలోనే ధృవీకరణ ప్రక్రియను పూర్తి చేసి తక్షణమే పోర్టల్‌కు అప్‌డేట్ చేయవచ్చని వివరించారు.క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా అధికారులు దరఖాస్తుదారుల నివాసానికి వెళ్లి సంబంధిత వివరాలను యాప్‌లో నమోదు చేయడం, జియో-ట్యాగ్‌తో కూడిన లైవ్ ఫోటోలను అప్‌లోడ్ చేయడం వల్ల నకిలీ దరఖాస్తులకు అవకాశం లేకుండా పారదర్శకత పెరుగుతుందని తెలిపారు. భౌతిక ఫైళ్ల కదలిక అవసరం లేకుండా పూర్తిగా డిజిటల్ విధానంలోనే పరిశీలన పూర్తయ్యే విధంగా వ్యవస్థ ఉండటంతో, ముఖ్యంగా కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాల దరఖాస్తులు త్వరితగతిన ఆమోదం పొందే అవకాశం ఉంటుందని తెలిపారు . యాప్ ద్వారా సేకరించిన సమాచారం నేరుగా

మిగతా 4లో...

# సకల సదుపాయాలతో భవిత కేంద్రాలు : అడిషనల్ కలెక్టర్ శ్రీజ

**టీ మీడియా ఫిబ్రవరి 21 కామేపల్లి:**
ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ఏర్పాటు చేయనున్న భవిత కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని ఖమ్మం జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీజ అధికారులను ఆదేశించారు. శనివారం నాడు ఆమె కామేపల్లి మండల పరిధిలోని కొత్త లింగాల గ్రామపంచాయతీ యుపిఎస్ స్కూల్ లో ఏర్పాటు చేయనున్న భవిత కేంద్రం స్థలాన్ని పరిశీలించారు. ప్రస్తుతం యుపిఎస్ లో ఉన్న గదిలో భవిత కేంద్రం ఏర్పాటుకు నిర్ణయించగా, గది ముందు భాగంలో ఉన్న వరండాకు సైతం గ్రిల్స్ పెట్టించి గదిలా మార్చాలన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు మౌలిక సదుపాయాలైన ర్యాంప్, టాయిలెట్స్, రైలింగ్, తాగునీరు వంటి కనీస వసతులు ఏర్పాటు చేయాలని, అంతేకాక వారికి తగ్గట్టుగా కృత్యాధార పద్ధతిలో బోధన ఉండేలా సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు తహసిల్దార్ సిహెచ్ సుధాకర్ ఎంపీడీవో రవీంద్రనాథ్ మరియు మండల అధికారులు పాల్గొన్నారు.



# పేదల సంక్షేమం పట్టని బీజేపీ ప్రభుత్వం



**టీ మీడియా, ఫిబ్రవరి21, సింగరేణి (కారేపల్లి):** దేశ ప్రధాని గా ప్రజల ఆకాంక్షలు, ప్రయోజనాలను కాపాడాల్సిన మోడీ తనకు ఎలక్ట్రోల్ బాండ్ రూపంలో చందాలిచ్చే కార్పొరేట్ మిత్రుల ప్రయోజనాలకోసం ఆరాట పడుతున్నారని సీపీఐ(ఎం) కారేపల్లి మండల కార్యదర్శి కే.నరేంద్ర విమర్శించారు. కారేపల్లి మండలం మాధారంలో ఆమరజీవి భాగం రామనర్సయ్య 30వ వర్ధంతిని నిర్వహించారు. ఈసందర్భంగా గుర్రం వెంకన్న అధ్యక్షతన జరిగిన సభలో కే.నరేంద్ర మాట్లాడుతూ ట్రంప్ సుంకాలతో భారతదేశాన్ని తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి నెడుతున్న ప్రధాని మోడి మౌన మునిల కూర్చున్నారన్నారు. అమెరికాతో ఇటీవల భారత్ చేసుకున్న ఒప్పందాలతో దేశ వ్యవసాయ, ఉత్పత్తి రంగం దెబ్బతినే పరిస్థితి ఉందన్నారు. పేదల ఉపాధి దూరం చేస్తూ ఉపాధి చట్టాన్ని మార్పు చేశారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీల అమలులో విఫలమైందన్నారు. ప్రజావ్యతిరేకతను మూట కట్టుకోకుండా వెంటనే ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అమరుల త్యాగాలు వృధాకావని భాగం రామనర్సయ్య లాంటి అమరులు స్ఫూర్తితో ప్రజా పోరాటాలు నెరపటం ద్వారా సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. అంతకు ముందు పార్టీ పతాకాన్ని సీనియర్ నాయకుడు తుమ్మోజు రామ్మూర్తి ఆవిష్కరించారు. ఈ వర్ధంతి సభలో మాజీ ఎంపీటీసీ భాగం రూప నాగేశ్వరరావు, సీపీఐ(ఎం) వైరా డివిజన్ కమిటీ సభ్యులు వజ్జా రామారావు, శాఖ కార్యదర్శి పాపిన్ని నాగేశ్వరావు, నాయకులు గుంపెనపల్లి నరసింహారావు, పొట్లకాయల రమేష్, సిపిఐ మండల కార్యదర్శి పాపిని సత్యనారాయణ, గ్రామపంచాయతీ వార్డ్ మెంబర్లు కావేటి పద్మ, భూక్య రజిని, గ్రామ పెద్దలు కంచం కోటయ్య, భాగం వెంకట అప్పారావు, బత్తుల సర్వయ్య, గుర్రం నరసింహారావు, కప్పెర రంగారావు తదితరులు పాల్గొన్నారు

# చైతన్య శీలి సేవాలాల్ మహారాజ్ -వైరా ఎమ్మెల్యే

## కారేపల్లిలో ఘనంగా బోగ్ బండారో



**టీ మీడియా,ఫిబ్రవరి21, సింగరేణి (కారేపల్లి) :** హక్కుల కోసం బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్య పరిచిన చైతన్య శీలి సంత్ సేవాలాల్ మాహారాజ్ అని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ అన్నారు. బంజార గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ 287 వ జయంతి ఉత్సవాలను కారేపల్లి లో శనివారం ప్రభుత్వం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ అనంతుల రమేష్ అధ్యక్షతన జరిగిన బోగ్ బండారో,సేవాలాల్ జయంతికి ముఖ్య అతిథులుగా వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ, లంబాడి ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్ కుమార్ జాదవ్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిజాయితీ, శ్రమ, సేవా భావాన్ని ప్రజలలో రగిలించారన్నారు. సేవాలాల్ స్ఫూర్తితో జాతి ఐక్యత, ఉన్నత లక్ష్యాల వైపు నేటి యువత పయనించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సోసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు, సర్పంచులు బానోత్ హిరాలాల్, మేదరి వీరప్రతాఫ్(టోనీ), మాజీ జెడ్పిటిసి బానోత్ దేవ్లా, కాంగ్రెస్ నాయకురాలు పగడాల మంజుల, ఎంపీఓ మల్లెల రవీంద్ర ప్రసాద్, సీఐ సాగర్, ఎస్సై బైరు గోపి, వైరా ఏడిఏ తుమ్మలపల్లి కరుణశ్రీ, ఏవో బట్టు అశోక్ కుమార్, వివిధ శాఖల అధికారులతో పాటు, అన్ని గ్రామ పంచాయతీల సర్పంచులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# క్రీడా మైదానం ఏర్పాటుకు వినతిపత్రం

**టీ మీడియా ,ఫిబ్రవరి 21, సారపాక:** మేజర్ పంచాయతీ అభివృద్ధి పై శనివారం నూతన పాలకవర్గం ఏర్పడిన తర్వాత సర్పంచ్ కిషోర్ శివరాం నాయక్‌అధ్యక్షతన మొదటి గ్రామసభ జరిగింది. సుమారు 50 వేల జనాభా కలిగిన సారపాక గ్రామంలో ఇంతవరకు ఒక సమగ్ర క్రీడా మైదానం లేకపోవడం అత్యంత విచారకరం. గ్రామంలోని వందలాది మంది పిల్లలు మరియు యువకులు సరైన స్థలం లేక రహదారుల పక్కన, ఖాళీ ప్రదేశాల్లో క్రీడలు ఆడాల్సిన పరిస్థితి నెలకొంది.క్రీడలు కేవలం వినోదం మాత్రమే కాకుండా యువత ఆరోగ్యం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు మరియు జట్టు భావన పెంపొందించడానికి కీలకమైనవి. రాష్ట్ర మరియు జాతీయ స్థాయిలో ప్రతిభ చూపగల యువత మాన గ్రామంలో ఉన్నప్పటికీ, సరైన మౌలిక వసతుల లేమి కారణంగా వారి ప్రతిభ మరుగున పడుతోంది.ఈ నేపథ్యంలో గ్రామంలోని ప్రభుత్వ భూమిని గుర్తించి తక్షణమే శాశ్వత ప్లేగ్రౌండ్ ఏర్పాటు చేయాలని గ్రామ యువత కోరుతున్నారు.ఇది కేవలం ఒక అభ్యర్థన మాత్రమే కాకుండా గ్రామ యువత భవిష్యత్తుకు సంబంధించిన అత్యవసర అవసరమని గ్రామస్తులు స్పష్టం చేస్తున్నారు.వినతి పత్రం అభ్యదనకు స్పందించిన సర్పంచ్ కిషోర్ గారు అతి త్వరలోనే గ్రామనికి క్రీడా మైదానం ఏర్పాటుకు కృషి చేస్తాను అని మాట ఇచ్చారులి ఈ కార్యక్రమంలో సారపాక గ్రామ ఉపసర్పంచ్ రమేష్ గారు,గ్రామ పంచాయతీ ఇ వో,గ్రామ పాలకవర్గ సభ్యులు,అధికార పార్టీ నాయకులు,మిత్రపక్ష నాయకులు,ప్రతిపక్ష నాయకులు గ్రామపెద్దలు, గ్రామయువత, గ్రామ ప్రజలు,తదితరులు పాల్గొన్నారు



# ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ వైర్ దొంగల అరెస్ట్

**టీ మీడియా, ఫిబ్రవరి 21 ,కామేపల్లి:** ఖమ్మం జిల్లా కామేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ట్రాన్స్ఫార్మర్ కాపర్ వైర్ దొంగతనాల కేసును పోలీసులు సమర్థవంతంగా ఛేదించి, ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన కాపర్ వైర్ ని కూడా స్వాధీనం చేసుకున్నారు.సింగరేణి సీఐ ఎన్. సాగర్ తెలిపిన వివరాల ప్రకారం,తేది 20 న కామేపల్లి క్రాస్ రోడ్ వద్ద నిర్వహించిన వాహన తనిఖీల్లో అనుమానాస్పదంగా వెళ్తున్న స్కూటీని పోలీసులు నిలిపివేశారు. విచారణలో నిందితుడు వివిధ ప్రాంతాల్లో వరుసగా ట్రాన్స్ఫార్మర్ కాపర్ వైర్ దొంగతనాలకు పాల్పడినట్లు వెల్లడైంది.విచారణలో నిందితులు కామేపల్లి తో పాటు ఖమ్మం జిల్లా పరిధిలోని కారేపల్లి ఖమ్మం 3 టౌన్, అర్బన్, రూరల్, నేలకొండపల్లి, కొణిజర్ల పోలీస్ స్టేషన్ పరిధుల్లో దొంగతనాలకు పాల్పడినట్లు నిర్ధారణ అయ్యింది.మొత్తంగా 13 దొంగతన కేసుల్లో, సుమారు 19 ట్రాన్స్ఫార్మర్లను ధ్వంసం చేసి, అందులోని కాపర్ వైర్‌ను అపహరించినట్లు పోలీసులు తెలిపారు.



### అరెస్ట్ చేసిన నిందితుల వివరాలు

దేవల్ల శ్రీకాంత్ –వృత్తి: సుతారి మేస్త్రి,నివాసం: ప్రస్తుతం పాండురంగాపురం, ఖమ్మం అర్బన్ మండలం.: పేంద్ర సురేష్ -- వృత్తి: పాత ఇనుము కొట్టు వ్యాపారి,నివాసం: బుర్హాన్‌పురం, ఖమ్మం. సింగజోగి యాదగిరి -- వృత్తి: పాత ఇనుము కొట్టు వ్యాపారి,నివాసం: మామిళ్లగూడెం, ఖమ్మం.ఈ కేసులలో..సుమారు 100 కిలోల ట్రాన్స్ఫార్మర్ కాపర్ వైర్,దొంగతనానికి ఉపయోగించిన స్కూటీ స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఇక ఈ కేసులో సంబంధం ఉన్న ఇంకా ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నట్లు గుర్తించామని, వారిలో ఒకరు ఖమ్మంలో, ఇద్దరు హైదరాబాద్‌లో ఉన్నారని, వారిని కూడా త్వరలో అరెస్ట్ చేస్తామని పోలీసులు తెలిపారు.కామేపల్లి కేసులో ావవషి. 303(2), 112, 317(2) దీచీూ సెక్షన్ల కింద, అరెస్ట్ చేసి రిమాండ్ కి తరలించిన్నాము.ఇంకా దర్యాప్తు కొనసాగుతోంది.ఈ కేసును ఛేదించడంలో ప్రతిభ చూపిన కామేపల్లి ఎస్ ఐ శ్రీకాంత్, పోలీస్ స్టేషన్ సిబ్బందిని, సహకారం అందించిన కారెపల్లి ఎస్ఐగోపి,పోలీస్ స్టేషన్ సిబ్బందిని అధికారులు అభినందించారు.

### పోలీసుల హెచ్చరిక

ట్రాన్స్ఫార్మర్‌లు, విద్యుత్ పరికరాలు మరియు కాపర్ వైర్ దొంగతనాలు ప్రజా భద్రతకు తీవ్రమైన ముప్పుగా మారుతున్నాయని, ఇలాంటి నేరాలకు పాల్పడేవారిపై కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని, అలాగే దొంగిలించిన విద్యుత్ సామగ్రిని కొనుగోలు చేసే వారిపైనా చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు.

# ఘనంగా విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం.

**టి మీడియా,ఫిబ్రవరి 21, దుమ్ముగూడెం:**దుమ్ముగూడెం మండలం సీతారాంపురం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం 7వ తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తోలెం సుజాత మేడం విద్యార్థులను ఉద్దేశించి మట్లాడుతు క్రమశిక్షణతో శ్రద్దగా చదివి ఉన్నత శిఖరాలకి చేరుకోవాలని అన్నారు.ఈ సందర్భంగా గతంలో పాఠశాలలో పని చేసి ఉద్యోగోన్నతిపై మరొక పాఠశాలకి బదిలీ ఐన ఉపాధ్యాయుడు వరప్రసాద్ సార్ని శాలువతో సత్కరించారు. అనంతరం వరప్రసాద్ సార్ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని, భవిష్యత్తు తరాల్లో ప్రతి ఒక్కరు విద్య పట్ల ప్రత్యేక దృష్టి సారించి విద్యాబుద్ధులు నేర్చుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని విద్యార్థులకు తెలియజేయడం జరిగింది.అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపా ధ్యాయురాలు సుజాత,పాఠశాల ఉపాద్యాయిని, ఉపాధ్యాయులు సునీత, వరలక్ష్మి, శ్రీనివాస్,చిన్నక్క మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



# చలో హైదరాబాద్ను జయప్రదం చేయండి'

**టీ మీడియా ,ఫిబ్రవరి 21, కామేపల్లి:**ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కారం కోసం తలపెట్టిన 'చలో హైదరాబాద్' కార్య క్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి బాదావత్ శ్రీను పిలుపునిచ్చారు. శనివారం స్థానిక పీహెచ్సీ వైద్యురాలు ఎన్.చందనకు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. వేతనాల చెల్లింపులో జాప్యం లేకుండా చూడాలని కోరారు.






### తలసేమియా నివారణకు

# ముందస్తు పరీక్షలే మార్గం

### - ఐఎంఏ అధ్యక్షురాలు డాక్టర్ రెహానాబేగం

**టీ మీడియా,ఫిబ్రవరి21, ఖమ్మం :** ముందస్తుగా పరీక్షలు చేయించుకోవడం ద్వారానే తలసేమియా వ్యాధిని నివారించడం సాధ్యమవుతుందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ రెహానాబేగం అన్నారు. సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో తలసేమియా వ్యాధిపై ఖమ్మంలో శనివారం భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ఖమ్మం నగరంలోని పెవిలియన్ గ్రౌండ్ నుండి ప్రారంభమై పాత బస్టాండ్, ప్రభుత్వ ఆసుపత్రి వరకు సాగింది. ఈ ర్యాలీలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులు, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ పీడియాట్రిక్ ప్రతినిధులు, వైద్యులు, పులిపాటి కాలేజి ఆఫ్ నర్సింగ్, పులిపాటి స్కూల్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రెహానా బేగం మాట్లాడుతూ... తలసేమియా అనేది జన్యుపరంగా వచ్చే వ్యాధి అని, ఇది క్యారియర్ స్టేజ్‌లో ఉన్నప్పుడు తెలుసుకోవచ్చు అన్నారు. పిల్లల్లో ఈ వ్యాధి సోకినప్పుడు తీవ్ర రక్తహీనత, జాండిస్ వంటి సమస్యలు తలెత్తుతాయని, అస్తమానం రక్తం ఎక్కించడం వల్ల వారి జీవితకాలం తగ్గే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. హెచ్‌బీ ఎలక్ట్రోఫోరసిస్ (హెచ్‌బి ఎ--2) పరీక్ష ద్వారా దీనిని గుర్తించవచ్చన్నారు. ముఖ్యంగా గర్భిణిలు ముందస్తు పరీక్షలు చేయించుకోవడం ద్వారా తలసేమియా రహిత సమాజాన్ని నిర్మించవచ్చని పేర్కొన్నారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... తలసేమియా బాధితులను జబ్బు పడిన వారుగా కాకుండా 'క్లినికల్లీ ఛాలెంజ్డ్' వ్యక్తులుగా చూడాలని అన్నారు. ప్రస్తుతం ఉన్న ఏఐ, రోబోటిక్ టెక్నాలజీ, అడ్వాన్స్‌డ్ జీన్ ఎడిటింగ్ ద్వారా భవిష్యత్తులో ఈ వ్యాధిని పూర్తిగా నయంచేసే అవకాశం ఉందనే ఆశాభావం వ్యక్తం చేశారు. బాధితుల వెనుక ఉండి నడిపిస్తున్న తల్లిదండ్రులను ఆయన 'సైలెంట్ హీరోస్'గా అభివర్ణించారు. రక్తదానం చేయడం ద్వారా ఈ పిల్లల భవిష్యత్తుకు అండగా నిలవాలని కోరారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ పిడియాట్రిక్ కార్యదర్శి డాక్టర్ సాయి భార్గవ్ మాట్లాడుతూ.. తలసేమియా, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులకు తరచుగా రక్త మార్పిడి అవసరమని, యువత స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని కోరారు. వివాహం చేసుకోబోయే వారు ముందస్తుగా క్యారియర్ పరీక్షలు చేయించుకుంటే, తర్వాతి తరానికి ఈ వ్యాధి సంక్రమించకుండా అడ్డుకోవచ్చని సూచించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో విద్యార్థులతో కలిసి తలసేమియా రహిత సమాజం కోసం ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులు తలసేమియా నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు పి.అనిత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ కోటేశ్వరరావు, డాక్టర్ డి.నారాయణమూర్తి, డాక్టర్ లక్ష్మీదీప, డాక్టర్ నరేష్, ప్రముఖులు మమత, అనురాధ, సంస్థ ప్రతినిధులు పి.పావని, ఉదయభాస్కర్, రవిచందర్, వంశీ కిరిటి, రక్తదాతలు వంశీ, నవీన్, చిన్నారులు, తల్లిదండ్రులు, పులిపాటి కాలేజి ఆఫ్ నర్సింగ్, పులిపాటి స్కూల్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

### శంభులింగేశ్వర స్వామి ఆలయానికి

# రూ. 37.97 లక్షల ఆదాయం



**టీ మీడియా, ఫిబ్రవరి 21, మేళ్లచెరువు** మేళ్లచెరువులోని శంభులింగేశ్వర స్వామి మహాశివరాత్రి ఐదు రోజుల బ్రహ్మోత్సవాలు ముగిశాయి. పూర్ణాహుతితో పూజా క్రతువులు పూర్తయ్యాయి. స్వామి అమ్మవార్ల పవళింపు సేవ కనుల పండుగగా జరిగింది. భక్తులు సమర్పించిన ప్రధాన హుండీల కానుకలు మినహా వివిధ రూపాలలో ఈ జాతరకు రూ. 37,97,850 ల ఆదాయం సమకూరినట్లు ఈఓ నాగెళ్ల శంభిరెడ్డి తెలిపారు.ఎడ్ల పందేలలో సీనియర్ విభాగంలో హుజూర్‌నగర్ కు చెందిన సుంకి సురేందర్ రెడ్డి గిత్తలు 2533 అడుగుల దూరాన్ని బండను లాగి ఫస్ట్ ప్రైజ్ గా ట్రాక్టర్ ను, కడప జిల్లా కల్లూరు గ్రామానికి చెందిన పెరుమాళ్ల శివకృష్ణ యాదవ్ గిత్తలు 2250 అడుగుల దూరాన్ని బండను లాగి సెకండ్ ప్రైజ్ గా బుల్లెట్ మోటర్ సైకిల్ ను గెల్చుకున్నాయి. ఆయా కార్యక్రమాల్లో చైర్మన్ పెండ్లి లచ్చయ్య, సర్పంచ్ బచ్చు పద్మావతి శ్రీనివాసరెడ్డి, కొంకపాక రాధాకృష్ణ మూర్తి, విష్ణు వర్ధన్ శర్మ, ధనుంజయ శర్మ, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులుపాల్గొన్నారు.

# నూతన సంత కొరకు కరపత్రాల ద్వారా ప్రచారం



**టీ మీడియా, ఫిబ్రవరి 21,తిరుమలాయపాలెం :** సుబ్లేడ్ గ్రామంలో గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నూతనంగా సంత ఏర్పాటు చేయాలని పిండి ప్రోల్ సంతలో సుబ్లేడ్ సర్పంచ్ సంగబత్తుల స్వాతి సుమన్ రెడ్డి ఆధ్వర్యంలో పాలక మండలి సభ్యులు కరపత్రాలు ద్వారా ప్రచారం చేశారు. మంగళవారం రోజున సంతను నిర్వహించనుండగా గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు తాజా కూరగాయలు, ఆకుకూరలు మరియు ఇతర వ్యవసాయ ఉత్పత్తులు అందుబాటులోకి రానున్నాయి. మధ్యవర్తుల జోక్యం లేకుండా రైతులు తమ పంటలను నేరుగా విక్రయించే అవకాశం కల్పించడంతో రైతులకు న్యాయమైన ధర లభించనుందని నిర్వాహకులు తెలిపారు. సర్పంచ్ నేతృత్వంలో ఈ నూతన సంత ఏర్పాటు ఏర్పాటు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ సంత ప్రారంభంతో స్థానిక రైతులకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు గ్రామ ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తుందని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు. గ్రామంలో నిత్యావసరాల కొనుగోలు సులభమవడంతో ప్రజలకు సమయం, ఖర్చు ఆదా అవుతుందని తెలిపారు. గ్రామ అభివృద్ధి దిశగా తీసుకున్న ఈ నిర్ణయాన్ని ప్రజలు హర్షాతిరేకాలతో స్వాగతిస్తూ సంతను విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూక్య వీరన్న మాజీ ఉప సర్పంచ్ బత్తుల వెంకటనారాయణ గ్రామ పెద్దలు గుంజ యాళ్లమంద కంచం వీరన్న, పోలె పొంగు ముత్తయ్య,గండమళ్ళ సూరయ్య, భూక్య సతీష్, గంధసిరి ఉపేందర్, పోలే పొంగు బాలరాజు, గంధసిరి విజయ్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ఏదూలపురం మున్సిపాలిటీ లో అక్రమ నిర్మాణాలు



**టి మీడియా , ఫిబ్రవరి 21,ఖమ్మం రూరల్:**ఎదులపురం సర్వే నెంబర్,101,లో గల సీలింగ్ భూమిలో కొందరు అక్రమ నిర్మాణాలు చేయడానికి ప్రయతిస్తున్నందున వాటిని అడ్డుకొని రూరల్ రెవెన్యూ టీమ్ వాటిని తొలగించి ప్రభుత్వ భూమి అని హెచ్చరిక బోర్డు పెట్టడం జరిగింది.కొందరు వ్యక్తులు ఎదులపురం మున్సిపాల్టీ పరిధిలో ఎక్కడ ప్రభుత్వ భూమి ఉన్నా వాటిని కబ్జా చేసి పేదలకు అమ్ముతూ వారిని మోసం చేసి అక్రమ వసూళ్లు చేస్తున్నారు.విషయం తెలియని నిరుపేదలు ప్రభుత్వ భూములను కొని మోసపోతున్నారు.ఈ విధం గా ప్రభుత్వ భూములను కబ్జా చెయ్యడానికి ప్రయత్నిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని,ఈ సందర్భంగా రూరల్ తహసీల్దార్ గారు హెచ్చరించారు.ఈ. సీలింగ్ భూమి విలువ దాదాపు 2 కోట్ల వరకు ఉంటుందని రెవెన్యూ అధికారులు తెలిపినారు.

# యువకుడు ఆత్మహత్య



**టీ మీడియా,ఫిబ్రవరి21, అశ్వాపురం:** మొండికుంట గ్రామానికి చెందిన సున్నం జయంత్ (22) శనివారం ఆత్మహత్య చేసుకున్న ఘటన స్థానికంగా కలకలం రేపింది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం, జయంత్ తండ్రి బాలరాజు గతంలో ప్రమాదంలో మరణించగా, తల్లి కూడా అతన్ని వదిలి వెళ్లిపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురైనట్లు సమాచారం. ఒంటరితనాన్ని భరించలేక మొండికుంట గ్రామ శివారులోని ఓ చెట్టుకు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై మృతుడి బాబాయి సున్నం సతీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ఆటిజంపై అవగాహన సదస్సు



**టీ మీడియా ,ఫిబ్రవరి 21 ,తిరుమలాయపాలెం :**పిండిప్రోలు గ్రామపంచాయతీ సర్పంచ్ కామల్ల సువార్త ఉప సర్పంచ్ చామకూరి రాజ్ కుమార్ ఆధ్వర్యంలో హైదరాబాదులోని ఏకలవ్య డెవలప్మెంట్ వారిచే ఆర్టిజం చిన్నపిల్లల పోషణ పై ప్రజల అవగాహన జరిగింది.ఈ అవగాహన సదస్సు దివంగత డాక్టర్ పట్టాభిరామ్ టీం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం పిండిప్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించారు చిన్నారుల్లో ఆటిజం లక్షణాలు తొలి దశలో గుర్తించి విధానం తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు సరైన పోషణ మరియు చికిత్స విధానాలపై నిపుణులు సమగ్రహా కల్పించనున్నారు.ఈ కార్యక్రమాన్ని మేనేజ్మెంట్ ఫౌండర్ అండ్ సీఈవో ఆర్గనైజర్ కామల్ల సునిల్ డాక్టర్ సాంబశివరావు డాక్టర్ సుచరిత సౌజన్య ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. తల్లిదండ్రులు ఉపాధ్యాయులు సామాజిక కార్యకర్తలు పిల్లలు పిల్లల తల్లిదండ్రులు ఈ సదస్సు ద్వారా ఆటిజంపై ఉన్న అపోహల పై అవగాహన కల్పించారు .ఎనిమిదవ తరగతి నుండి పదవ తరగతి విద్యార్థులు తీసుకోవాల్సిన నిర్ణయాలపై ప్రత్యేక కార్యక్రమం విద్యార్థుల భవిష్యత్తు కొరకు 8వ తరగతి నుంచి సరైన మార్గదర్శకం ఇంతైనా అవసరం ఉందని అన్నారు

**8వ తరగతి నుంచి...**

తొమ్మిదవ పదవ తరగతిలో కెరీర్ పై అవగాహన పెంపొందించుకోవడం, పదవ తరగతి తర్వాత వచ్చే విద్యా మార్గాలు ఇంటర్ పాలిటెక్నిక్ ఇతర వృత్తి విద్యా కోర్సులు,విద్యార్థుల ఆసక్తులు నైపుణ్యాల ఆధారంగా సరైన కోర్సు ఎంపిక, తల్లిదండ్రుల పాత్ర ప్రోత్సాహం,పోటీపరీక్షల ప్రాధాన్యత భవిష్యత్తు ఉద్యోగ అవకాశాలు, ఇట్టి విషయాలపై నిపుణుల మార్గదర్శకత్వంలో విద్యార్థులు తల్లిదండ్రులకు స్పష్టమైన అవగాహన కల్పించడం జరిగిందని ఏకలవ్య ఫౌండేషన్ సీఈవో కామల్ల సునీల్ ఆధ్వర్యంలో బిహేవియర్ కామల్ల సునీల్ ఫిజియోథెరపిస్ట్ సుచరిత స్పీచ్ తెరపిస్ట్ సౌజన్య పట్టాభిరామ్ శిష్యులు సాంబశివరావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నూ కారపు బాబు గ్రామపంచాయతీ కార్యదర్శి రాము అంగన్వాడీ టీచర్స్ ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# అసైన్మెంట్ భూములపై మట్టి మాఫియా బీభత్సం



**టీ మీడియా, ఫిబ్రవరి 21 ,తిరుమలాయపాలెం :**హస్నాబాద్ గ్రామం పరిధిలోని అసైన్మెంట్ భూముల్లో నుంచి అక్రమంగా మట్టిని తవ్వి ప్రైవేట్ నిర్మాణాలకు తరలిస్తున్న మట్టి మాఫియా అరాచకాలు బయటపడ్డాయి. ఈ అక్రమ వ్యవహారంపై సమాచారం సేకరించి, ఫోటోలు తీస్తూ వార్తను కవర్ చేస్తున్న ఓ విలేకరి పై దాడికి యత్నించడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.స్థానికుల సమాచారం ప్రకారం జెసిబిల సహాయంతో వందలాది ట్రాక్టర్ల ద్వారా అసైన్మెంట్ భూమిలోని మట్టిని అక్రమంగా రవాణా చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ప్రజా ఆస్తిగా ఉన్న భూమిని రక్షించాల్సిన బాధ్యత ఉన్న సమయంలో ఇలాంటి అక్రమాలు జరగడం గమనార్హం. అధికారులు తక్షణమే కేసు నమోదు చేసి, అక్రమ మట్టి రవాణాను అడ్డుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రజా ఆస్తులను కాపాడటంలో ప్రభుత్వం, రెవెన్యూ మరియు పోలీస్ శాఖలు కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# ముగిసిన సర్పంచ్ ల శిక్షణ

- **అభివృద్ధి దిశగా కీలక అడుగు**



**టీ మీడియా, ఫిబ్రవరి 21 ,తిరుమలాయపాలెం ;**డి పి ఆర్ సి భవనం ఖమ్మంలో నూతన సర్పంచ్ ల కోసం నిర్వహించిన ఐదు రోజుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమం శనివారంతో విజయవంతంగా ముగిసింది. గ్రామ అభివృద్ధి, పారదర్శక పాలన, పథకాల అమలు, వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించేందుకు ఈ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. చివర రోజు కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అనుదీప్ దిరిశెట్టి ముఖ్య అతిథిగా హాజరై సర్పంచ్ ల సూచనలు సలహాలు అందించారు. గ్రామస్థాయిలో సమగ్ర అభివృద్ధి సాధించేందుకు సర్పంచ్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ప్రభుత్వ పథకాల పారదర్శకంగా అమలు చేయాలని ఆయన సూచించారు. ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు గ్రామ సభలను సమర్ధవంతంగా నిర్వహించాలని సూచనలు చేసినారు.ఈ ఐదు రోజుల శిక్షణలో గ్రామపంచాయతీ చట్టాలు నిధుల వినియోగ విధానం అభివృద్ధి పనుల ప్రణాళిక స్వచ్ఛత కార్యక్రమాలు పర్యావరణ పరిరక్షణ డిజిటల్ రికార్డు నిర్వహణ అంటే అంశాలపై నిపుణులు వివరించారు. సర్పంచులు తమ గ్రామాల్లో ఎదురయ్య సమస్యలను చర్చించి పరిష్కార మార్గాలు తెలుసుకున్నారు.శిక్షణ అనంతరం జిల్లా కలెక్టర్ నూతన సర్పంచ్ లకు సర్టిఫికెట్ అందజేశారు ఈ కార్యక్రమం ద్వారా గ్రామపంచాయతీ సర్పంచ్ ల బాధ్యత భావం, పరిపాలన నైపుణ్యాలు మరింత పెరగని అధికారులు తెలిపారు.గ్రామ అభివృద్ధి పట్ల సర్పంచులు మరింత చైతన్యంతో ముందుకు సాగాలని,ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టాలని అధికారులు ఆకాంక్షించారు. ఈ ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం గ్రామ పాలనలో నాణ్యతను పెంపొందించడంలో కీలకంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. నూతనంగా ఎన్నికైన సర్పంచులు, అన్ని మండల అధికారులు పాల్గొన్నారు.

# గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలి

- **జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**



**టీ మీడియా,ఫిబ్రవరి21, భద్రాద్రి కొత్తగూడెం:** గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి గ్రామపంచాయతీ సర్పంచుల పాత్ర అత్యంత కీలకమని, ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా అభివృద్ధి చేసే దిశగా సమగ్ర ప్రణాళికతో కట్టుదిట్టంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పేర్కొన్నారు. శనివారం డాక్టర్ మన్మోహన్ సింగ్ ఇనిస్ట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ పాత క్యాంపస్ నందు నిర్వహించిన రెండవ విడత నూతన సర్పంచుల శిక్షణ కార్యక్రమం ముగింపు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని సర్పంచులకు దిశానిర్దేశం చేశారు.జిల్లాలోని అశ్వరావుపేట, దమ్మపేట, దుమ్ముగూడెం, ములకలపల్లి, జూలూరుపాడు, టేకులపల్లి, ఇల్లందు, లక్ష్మీదేవిపల్లి మండలాలకు చెందిన మొత్తం 233 మంది నూతన సర్పంచులకు ఈనెల 17 నుండి 21 వరకు శిక్షణ కార్యక్రమం నిర్వహించబడినట్లు కలెక్టర్ తెలిపారు. సర్పంచులు పంచాయతీరాజ్ చట్టంపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని, గ్రామస్థాయిలో ప్రజలకు సమర్ధవంతమైన సేవలు అందించేందుకు చట్టబద్ధమైన అధికారాలు , బాధ్యతలను సముచితంగా వినియోగించు కోవాలని కలెక్టర్ సూచించారు.శిక్షణ కార్యక్రమంలో గ్రామపంచాయతీల పరిపాలన విధానం, గ్రామాభివృద్ధి కార్యాచరణ ప్రణాళికల రూపకల్పన, బడ్జెట్ నిర్వహణ, ఆర్థిక పారదర్శకత, ప్రజల భాగస్వామ్యం, సామాజిక బాధ్యత వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించబడినట్లు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న కుటుంబ సంక్షేమం, విద్య, ప్రజారోగ్యం, పారిశుద్ధ్యం, సామాజికాభివృద్ధి, పేదరిక నిర్మూలన తదితర సంక్షేమ కార్యక్రమాలు గ్రామస్థాయిలో సమర్ధవంతంగా అమలవ్వాలంటే సర్పంచులు నాయకత్వ లక్షణాలతో ముందుండాలని ఆయన అన్నారుశిక్షణలో నేర్చుకున్న అంశాలను గ్రామ ప్రజల శ్రేయస్సు కోసం కార్యాచరణలో పెట్టి, ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు సర్పంచులందరూ సమన్వయంతో కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీపీఓ సుధీర్, శిక్షణ డీపీఓ అనూష, డీఎల్పీఓలు ప్రభాకర్, రమణ, టీజీఐఆర్డీ సెంటర్ హెడ్ సుభాష్ చంద్ర గౌడ్, ట్రైనర్లు బన్సింగ్, రవీందర్ రెడ్డి, సునీల్ కుమార్, ముత్యాలరావు, హజ్రత్ వలి, ఏపీవో రంగ, ఎస్బీఎం రేవతి, డిటిఎం సందీప్, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ



**టీ మీడియా,ఫిబ్రవరి21, బూర్గంపాడు:** మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణతో పాటు సమాజానికి మేలు జరుగుతుందని రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ రామ్ ప్రసాద్,రోటేరియన్ శైలేంద్ర సింగ్ అన్నారు. శనివారం తాళ్ల గొమ్మూరు గ్రామంలో రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్ర సారపాక ఆధ్వర్యంలో సుమారు 15,000 మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి మొక్కలను నాటుతున్నారు.వాతావరణ సమతుల్యత పాటించాలంటే మొక్కలను నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరు విధిగా చెట్ల పెంపకం చేపట్టాలని, ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా జూట్‌బ్యాగ్‌లను, కాటన్ బ్యాగ్‌లను ఉపయోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు రోటేరియన్ రాంబాబు, కార్యదర్శి రోటేరియన్ చాంద్ బాషా, రోటేరియన్లు శ్యామ్ కిరణ్, భాస్కర్,ప్రఫుల్ల కుమార్, చంగల్ రావు, బసప్ప రమేష్, రాజశేఖర్, సత్యనారాయణ,మురళీధర్, తిరుపతిరావు, మహేష్, రోటరాక్టర్స్ విద్యావాణి, మల్లికార్జున్, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ క్యాన్సర్ దినోత్సవ అవగాహన సదస్సు




**టీ మీడియా,ఫిబ్రవరి21,రుద్రంపూర్:** ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏడాది లక్షలాది మంది క్యాన్సర్ బారిన పడుతున్నారని, ముఖ్యంగా ఊపిరితిత్తుల, రొమ్ము, గర్భాశయ, నోటి క్యాన్సర్లు ఎక్కువగా నమోదవుతున్నాయని హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లలిత కుమారి అన్నారు. కొత్తగూడెం ఏరియాలోని ఏరియా వర్క్‌షాప్‌లో శనివారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన సదస్సు నిర్వహించారు. సింగరేణి ప్రధాన ఆస్పత్రి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి హెచ్.ఓ.డి జె.క్రిష్టఫర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 4న ప్రపంచ వ్యాప్తంగా ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని నిర్వహిస్తారని తెలిపారు. యూనియన్ ఫర్ ఇంటర్నేషనల్ క్యాన్సర్ కంట్రోల్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశ్యం క్యాన్సర్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, ముందస్తు నిర్ధారణ, సమయానుకూల చికిత్స ప్రాముఖ్యతను తెలియజేయడం, బాధితులకు మానసిక––సామాజిక మద్దతు కల్పించడమేనని అన్నారు. ముందస్తు నిర్ధారణ ద్వారా ప్రారంభ దశలోనే క్యాన్సర్‌ను గుర్తిస్తే చికిత్స విజయవంతమయ్యే అవకాశాలు అధికంగా ఉంటాయన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని రుద్రంపూర్ డిస్పెన్సరీ మెడికల్ సూపరింటెండెంట్ ఎం.పరశు రాములు మాట్లాడుతూ.. క్యాన్సర్‌పై అవగాహన జీవన రక్షణకు తొలి అడుగు. సమయానికి నిర్ధారణ, సరైన చికిత్స, ధైర్యం ఉంటే క్యాన్సర్‌ను జయించవచ్చు అని ఆమె పేర్కొన్నారు. అనంతరం వర్క్‌షాప్ ఉద్యోగులు అడిగిన పలు సందేహాలకు వైద్యులు సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివైఎస్ఈ టి.అనిల్, ఐఎన్టీయూసీ ఫిట్ కార్యదర్శి, ఎండి సత్తార్ పాషా, ఏఐటీయూసీ ఫిట్ కార్యదర్శి ఎం.మధుకృష్ణ, సూపర్‌వైజర్లు, కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు, ఆల్ ట్రేడ్ అప్రెంటీసులు, డిఎల్ఆర్ ఉద్యోగులు పాల్గొన్నారు.

# పైప్‌లైన్ మరమ్మత్తులు పరిశీలించిన సర్పంచ్



**టీ మీడియా, ఫిబ్రవరి 21 ,తిరుమలాయపాలెం:** హస్నాబాద్ గ్రామపంచాయతీ పరిధిలోని పలు వార్డుల్లో ఇటీవల దెబ్బతిన్న తాగునీటి సరఫరా పైప్‌లైన్ మరమ్మత్తుల పనులను సర్పంచ్ కొవ్వూరి పద్మా సత్తిరెడ్డి ప్రత్యక్షంగా పరిశీలించారు. గ్రామ ప్రజలకు అంతరాయం లేకుండా శుద్ధమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో పనులు వేగవంతం చేయాలని సంబంధిత సిబ్బందికి ఆమె ఆదేశించారు.ఈ సందర్భంగా గ్రామ కార్యదర్శి నర్మదా హాజరై, పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించారు. పైప్‌లైన్ లీకేజీలను పూర్తిగా నివారించి, భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.గ్రామంలో నీటి సమస్యలు తలెత్తకుండా శాశ్వత పరిష్కారం కోసం గ్రామపంచాయతీ కట్టుబడి ఉందని సర్పంచ్ తెలిపారు. ప్రజల సహకారంతో గ్రామ అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతం చేస్తామని పేర్కొన్నారు.

# మీసేవ సర్టిఫికెట్ వెరిఫికేషన్

మీసేవ పోర్టల్‌కు అనుసంధానమై డేటా తక్షణమే అప్‌డేట్ అవుతుందని తెలిపారు.ఈ శిక్షణ తరగతులకు జిల్లాలోని సుమారు 160 మంది జీపీవోలు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, 40 మంది నయాబ్ తహసీల్దార్లు మరియు 15 మంది ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు. యాప్ డౌన్‌లోడ్ విధానం, లాగిన్ ప్రక్రియ, ఫీల్డ్ వెరిఫికేషన్ నమోదు, ఫోటో అప్‌లోడ్, రిపోర్ట్ సమర్పణ తదితర అంశాలపై ప్రదర్శనతో కూడిన సమగ్ర అవగాహన కల్పించారు. అధికారుల సందేహాలకు వివరణాత్మక సమాధానాలు అందించి, యాప్ వినియోగాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు.జిల్లాలో మీసేవ సేవలను మరింత పారదర్శకంగా మరియు సమర్థవంతంగా అమలు చేసి, ప్రజలకు నాణ్యమైన సేవలను వేగవంతంగా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐటీ శాఖ సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడిగా మనోజ్



**టీ మీడియా,ఫిబ్రవరి21,ఖమ్మం రూరల్ :** ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ముత్తగూడెంకి చెందిన ఏఐఎస్ఎఫ్ ఖమ్మం రూరల్ మండలం కార్యదర్శి బూర్రా మనోజ్ కుమార్ ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడిగా ఎన్నికయ్యాడు. ఈ మేరకు నిజామాబాద్ పట్టణంలో ఈ నెల 18, 19, 20 తేదీలలో జరిగిన ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభల్లో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడిగా నియమితులయ్యాడు. ఈ సందర్భంగా మనోజ్ మాట్లాడుతూ... తనపై నమ్మకం ఉంచి బాధ్యతను అప్పగించిన రాష్ట్ర పార్టీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశాడు.




# లోక్యతండా పాఠశాలకు
# వాటర్ కూలర్ బహూకరణ

**టీ మీడియా,ఫిబ్రవరి21,కూసుమంచి:** కూసుమంచి మండలంలోని లోక్యతండా ప్రాథమికోన్నత పాఠశాలకు ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్ క్రాస్ రోడ్డుకు చెందిన తాటి శ్రీనివాస్ వాటర్ కూలర్ ను బహుకరించారు. వేసవికాలం దృష్ట్యా విద్యార్థులకు చల్లని నీరు అందించేందుకు వాటర్ కూలర్ ను అందించాలని నిర్ణయించి శనివారం సర్పంచ్ వెంకట్ సమక్షంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాదె వెంకన్నకు అందించారు.ఈ సందర్భంగా సర్పంచ్ వెంకటేష్ మాట్లాడుతూ... వేసవి కాలంలో విద్యార్థులకు వాటర్ కూలర్ అందించడం అభినందనీయమన్నారు. దాతలు ముందుకు వచ్చి పాఠశాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. హెచ్ఎం మాట్లాడుతూ.. దాతలు మందుకు వచ్చి విద్యాభివృద్ధికి తోడ్పాటును అందించడం ఇతరులకు ఆదర్శమన్నారు. ఈ సందర్భంగా దాత శ్రీనివాస్ ను సర్పంచ్ వడ్త్యా. వెంకటేష్, ఉప సర్పంచ్ నీలమ్మ, వార్డ్ సభ్యులు, వడిత్య శ్రీను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుభద్ర, రవిరత్నం విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.